

బస్‌భవన్ ఎదుట ధర్నాలో నినదిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ జాగృతి నాయకులు

## నిరుపేద విద్యార్థులపై పెనుభారమా?

- బస్‌పాస్‌చార్జీలు తగ్గించాలి
- జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- బస్‌భవన్ ఎదుట ధర్నా.. అరెస్టు

సైదాబాద్, జూన్ 10: ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను పెంచి నిరుపేద విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం పెనుభారం మోపిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఒక్కో విద్యార్థిపై నెలకు సగటున రూ.300కు పైగా అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. బస్‌పాస్ చార్జీల పెంపును నిరసిస్తూ హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న కవిత సహా ఇతర నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్‌పాస్ చార్జీలనే పెంచడం భావ్యంకాదని హితవు పలికారు. ఆర్టీసీ ఆదాయం పెరిగే మార్గాలను ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. ముఖ్యమంత్రిగా నాడు కేసీఆర్ ఆర్టీసీ సంస్థకు నిధులు కేటాయించి సంస్థను కాపాడారని తెలిపారు. ప్రస్తుత సీఎం కూడా సరిపడా నిధులు కేటాయించి ప్రజలపై భారం పడకుండా చూడాలని సూచించారు. మహిళలు, పురుషులు బస్సుల్లో కూర్చునే పరిస్థితులు లేవని, నిలబడి ప్రయాణించాల్సి వస్తున్నదని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచాలని టికెట్లు కొనే ప్రయాణికులే ప్రశ్నిస్తున్నారని ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా రూట్లలో విద్యార్థుల కోసం బస్సు సర్వీసులు లేక పోవడంతో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించేంతవరకు ఉద్యమిస్తామని కవిత హెచ్చరించారు.



బస్ భవన్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు

# బస్‌పాస్ చార్జీలపై పోరాటమే

- పెంపు విద్యార్థులపై పెనుభారం
- బస్సు సర్వీసులను పెంచాల్సిందే
- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు
- బస్‌భవన్ ముట్టడి.. నేతల అరెస్టు

చిక్కడపల్లి, జూన్ 10: విద్యార్థుల డిమాండ్ మేరకు తాము బస్సు సర్వీసులను పెంచమంటే, ప్రభుత్వం మాత్రం బస్‌పాస్ చార్జీలను పెంచి విద్యార్థులపై పెనుభారం మోపిందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. పెంచిన చార్జీలను తగ్గించకుంటే ప్రభుత్వంపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఆర్టీసీ పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బస్‌భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం బస్‌పాస్ చార్జీలను పెంచి పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఉన్న బస్‌పాస్ చార్జీలపై 20% అదనంగా పెంచి దోచుకోవాలనుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తల్లులకు ఉచితమని పిల్లల నుంచి అధిక చార్జీలు వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని, లేకుంటే బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్, నాయకులు పడాల సతీశ్, జంగయ్య, కాటం శివ, రాజేశ్ నాయక్, నర్సింగ్, మహిపాల్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేంద్ర రావు, అవినాశ్, రాహుల్, అద్వైత్‌రెడ్డి, ప్రశాంత్, కిరణ్, విశాల్, నితీశ్, రెహమాత్, సాయితేజరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులపై ఏటా 650 కోట్ల భారం

బస్‌పాస్ చార్జీల పెంపుతో విద్యార్థులపై ఏటా రూ.650 కోట్ల అదనపు భారం పడుతుందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపుతో విద్యార్థులంతా అయోమయంలో పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒకవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూనే.. మరోవైపు వారి కుటుంబ సభ్యులపై అధిక చార్జీలు మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సర్కార్ ఖాళీ ఖజానా నింపుకోవడానికి రాష్ట్రంలో విద్యార్థులే దొరికారా? అని నిలదీశారు. బస్‌పాస్ చార్జీల పెంపుతో ఆదాయాన్ని సమకూర్చుకుని, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తారా? అని ప్రశ్నించారు. పెంచిన చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్, నాయకులు నర్సింగ్, జంగయ్య, నితీశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలి

**బస్‌పాస్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి : ఏఐఎస్‌ఎఫ్**

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచుతూ ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. తెలంగాణలోని 10 లక్షలకుపైగా పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి ఆర్టీసీ బస్సుల ద్వారా పట్టణాలకు వెళ్తుంటారని.. ఈ చార్జీల(20 శాతంపైగా) పెంపు ద్వారా వారిపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్టీసీ యాజమాన్యం నెలకు రూ.400 ఉన్న బస్‌పాస్ చార్జీని రూ.600కు, 3నెలల ప్యాకేజీని రూ.1200 నుంచి రూ.1800కు పెంచుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ.. ఇప్పుడు బస్‌పాస్ చార్జీల పెంపు సరికాదని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బస్‌పాస్ చార్జీలను పెంచామని ప్రభుత్వం అంటుందని, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లనూ పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని, పెంచిన బస్‌పాస్ చార్జీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## మరో రైతు ఆత్మహత్య

### పంట దిగుబడి లేక ఆందోళన

**అప్పులు తీర్చలేక మనస్తాపం • మెదక్ జిల్లాలో విషాదం**



మంద స్వామి (ఫైల్)

వెల్దుర్తి, జూన్ 10: పంట దిగుబడి రాక, అప్పుల భారం మోయలేక ఓ రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలుకపల్లికి చెందిన రైతు మంద స్వామి(41)కి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తె పెండ్లి మాత్రమే చేశాడు. తనకున్న 20 గుంటల పొలంతోపాటు రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని కొన్నేండ్లుగా సాగుచేస్తున్నాడు. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతోపాటు రూ.10 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. వీటిని తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి మంగళవారం ఉదయం గ్రామ శివారులోని కాన్‌చెరువు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రాప్‌లోన్ చెల్లించలేదని ఆస్తుల జప్తునకు సిద్ధం

- గండీడ్, మహ్మదాబాద్ పరిధిలోని రైతులకు నోటీసులు
- 20 మంది రైతులకు చెందిన భూముల వేలానికి సిద్ధం



రైతుల పేర్ల జాబితాను నోటీస్ బోర్డుపై అంటిస్తున్న సిబ్బంది

గండీడ్/మహ్మదాబాద్, జూన్ 10: క్రాప్‌లోన్లు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించలేదన్న కారణంతో వారి ఆస్తుల జప్తునకు రంగం సిద్ధమైంది. బాధిత రైతుల పేరిట ఏకంగా నోటీసులను జారీ చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. గండీడ్ మండల కేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంక్, మహ్మదాబాద్‌కు చెందిన సహకార సంఘంలో పలువురు రైతులు స్థిరాస్తిని తాకట్టు పెట్టి వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. సకాలంలో బాకీ చెల్లించకపోవడంతో తాకట్టు పెట్టిన వారి భూములను వేలం వేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. రెండు మండలాల్లోని 14 మంది రైతుల ఆస్తులను జప్తు చేయడానికి అధికారులు సిద్ధంకాగా, తాజాగా ఆరుగురు రైతుల పేర్లను తొలుత నోటీస్‌బోర్డుపై ఉంచారు. సహకార సొసైటీ సిబ్బంది బహిరంగంగా నోటీసు బోర్డులపై రైతుల పేర్ల జాబితాను అతికించారు. రెండు మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద వేలం వేస్తున్న రైతుల వివరాలు నోటీస్ బోర్డులపై ఉంచడంతో సదరు అన్నదాతలు అవాక్కయ్యారు. వేలల్లో బాకీ ఉన్న రైతుల పేర్లు మాత్రమే నోటీసు బోర్డులో పెట్టి, రూ.లక్షలు బాకీ ఉన్న వారి పేర్లు జాబితాలో పెట్టకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

- ఇందూరు జిల్లాలో గాలివాన బీభత్సం



నిజామాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులతో జనం బెంబేలెత్తారు. వందలాది చెట్లు విరిగి ఇండ్లపై, రోడ్లకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్తు స్తంభాలు నేలకూలడంతో అంధకారం అలుముకున్నది. కొన్ని ప్రాంతాల్లో మంగళవారం కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. - ఖలీల్‌వాడి

- జొన్నల డబ్బులు చెల్లించాలని రైతుల ధర్నా



జొన్నల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. నెలలు గడుస్తున్నా సర్కార్ ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జొన్నల డబ్బులను చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. - బజార్‌హత్నూర్

చిత్రం



## రష్మిక మా అందరినీ బీట్ చేసింది!

**మంగళవారం** ముంబయిలో జరిగిన 'కుబేర' గీతావిష్కరణ కార్యక్రమంలో చిత్ర కథానాయిక రష్మిక మందన్న గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు అగ్ర నటుడు నాగార్జున. రష్మిక పవర్‌హౌజ్ అని ప్రశంసించారు. రష్మిక మందన్న గత చిత్రాల వసూళ్లను ఉద్దేశించి 'మీరు ఆమె ఫిల్మోగ్రఫీని గమనించారా? కలెక్షన్ల విషయంలో ఆమె మా అందరినీ బీట్ చేసింది' అని నాగార్జున అన్నారు. ప్రస్తుతం ఆయన మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన 'కుబేర' చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం ముంబయిలో 'పీ పీ డుమ్ డుమ్..' అనే గీతాన్ని ఆవిష్కరించారు. నాగార్జున మాట్లాడుతూ ''నేను నటించిన శివ, క్రిమినల్ చిత్రాలను హిందీ ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. శేఖర్ కమ్ములతో 15ఏళ్లుగా పనిచేయాలనుకుంటున్నా. ఇప్పుడు కుదిరింది. ఇదొక డిఫరెంట్ సబ్జెక్ట్. కథ చెప్పగానే మరో ఆలోచన లేకుండా అంగీకరించా. ధనుష్ ప్రతీ సినిమాలో వైవిధ్యం చూపిస్తుంటారు. ఈ మూవీలో ఆయన అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు' అన్నారు. ఈ సినిమాలో తాను బిచ్చగాడి పాత్రలో కనిపిస్తానని, ఇలాంటి పాత్రను ఇప్పటివరకు చేయలేదని, గొప్ప ఫిలాసఫీతో కూడిన కథ ఇదని ధనుష్ తెలిపారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'రియల్ లోకేషన్స్‌లో షూటింగ్ జరిపాం. నా క్యారెక్టర్ మీ అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. పుష్ప, యానిమల్, ఛావా తరహాలో నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది' అని చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## నాన్నకు పుట్టినరోజు బహుమతి

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన తన తండ్రి ప్రకాశ్ పదుకొనే 70వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఈ సందర్భంగా ఆయనకు ఓ అద్భుతమైన బహుమతిని అందించింది. పదుకొనే స్కూల్ ఆఫ్ బ్యాడ్మింటన్ మరో శాఖను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. దీనిని తన తండ్రికి అంకితమిస్తున్నట్లు తెలిపింది. 'బ్యాడ్మింటన్ క్రీడ మన శారీరక, మానసిక ఆరోగ్యాలను ఎంతలా మారుస్తుందో నేను ప్రత్యక్షంగా తెలుసుకున్నా. అందుకే పదుకొనే స్కూల్ ఆఫ్ బ్యాడ్మింటన్‌ను ప్రారంభించాం. ఈ సంస్థ ద్వారా క్రమశిక్షణతో కూడిన బ్యాడ్మింటన్ క్రీడలో శిక్షణనిస్తున్నాం. ఈ వయసులో కూడా నాన్న బ్యాడ్మింటన్‌ను ప్రాణంగా ప్రేమిస్తారు. అదే ఆయనకు ప్రపంచం. బ్యాడ్మింటన్ ఫర్ ఆల్ అనే లక్ష్యంతో నాన్నకు కానుకగా ఈ బ్రాంచీని ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని దీపికా పదుకొనే ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొంది. ఇప్పటికేపలు నగరాల్లో పదుకొనే స్కూల్ ఆఫ్ బ్యాడ్మింటన్ బ్రాంచీలు ఉన్నాయి. దీపికా పదుకోన్ తెలుగులో ఇటీవలే అల్లు అర్జున్-అట్లీ చిత్రానికి ఓకే చెప్పింది.

## సంజీవని ఘట్టం స్ఫూర్తితో సాహసగాథ



**మహేష్‌బాబు-రాజమౌళి** కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ప్రచారంలోకి వస్తున్నది. యస్‌యస్‌ఎంబీ29 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తిచేసుకుంది. ఈ సినిమా కథా నేపథ్యమేమిటన్నది అభిమానుల్లో ఉత్సుకతను పెంచుతున్నది. హనుమంతుడి స్ఫూర్తితో హీరో మహేష్‌బాబు పాత్రను డిజైన్ చేశారని గతంలో కథనాలు వెలువడ్డాయి. తాజా సమాచారం ప్రకారం భారతీయ ఇతిహాసం రామాయణంలోని ఓ ప్రధాన ఘట్టం ఆధారంగా ఈ కథను సిద్ధం చేశారని తెలుస్తున్నది. రామరావణ యుద్ధంలో మూర్ఛ పోయిన లక్ష్మణుడిని స్పృహలోకి తీసుకురావడానికి హనుమంతుడు సంజీవని కోసం హిమాలయాలకు బయలుదేరతాడు. అక్కడి ద్రోణగిరి పర్వతాన్ని పెకిలించి లంకకు తీసుకొచ్చి సంజీవనితో లక్ష్మణుడికి మెలకువ తెప్పిస్తాడు. ఈ సంజీవని ఎపిసోడ్ రామాయణ ఇతిహాసంలో ఉద్విగ్న భరితంగా అనిపిస్తుంది. హనుమంతుడి అచంచల రామభక్తికి, శౌర్యప్రతాపాలకు నిదర్శనంగా నిలుస్తుంది. రామాయణంలో ఈ ప్రధాన ఘట్టం స్ఫూర్తితోనే రాజమౌళి..మహేష్‌బాబు పాత్రను డిజైన్ చేశారని, ఆయన ఇందులో ఓ మహోన్నత లక్ష్యం కోసం ప్రపంచాన్ని చుట్టి వచ్చే సాహసికుడి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మూడో షెడ్యూల్ త్వరలో ప్రారంభంకానుంది.



## కాస్త ఓపిక పట్టాలి


సినీరంగంలో హీరోలతో పోల్చుకుంటే నాయికల కెరీర్ స్పాన్ తక్కువగా ఉంటుంది. ఒకవేళ వరుసగా ఫ్లాపులు పలకరిస్తే సదరు కథానాయికల కెరీర్ ప్రశ్నార్థకంగా మారుతుంది. కానీ ఈ ట్రెండ్‌కు భిన్నంగా ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటున్నది మంగళూరు సోయగం పూజాహెగ్డే. గత మూడేళ్లుగా ఈ భామకు ఒక్క హిట్ కూడా దక్కలేదు. ఇటీవల వచ్చిన 'రెట్రో' సైతం డిజాస్టర్‌గా నిలిచింది. వరుస ఫ్లాఫ్‌లు వచ్చినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసాన్ని కనబరుస్తున్నది పూజాహెగ్డే. కెరీర్‌లో ఇదొక బ్యాడ్‌ఫేజ్ అని, కాస్త ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నది. అందుక్కారణం లేకపోలేదు. ప్రస్తుతం ఈ భామ చేతిలో ఉన్నవన్నీ భారీ చిత్రాలే. రజనీకాంత్ 'కూలీ'లో అతిథి పాత్రలో కనిపించనుంది. ఇక దళపతి విజయ్‌తో కలిసి నటిస్తున్న 'జన నాయగన్'పై తమిళనాట భారీ అంచనాలున్నాయి. రాజకీయ రంగప్రవేశం దృష్ట్యా విజయ్ నటిస్తున్న చివరి చిత్రమిదే కావడంతో బ్లాక్‌బస్టర్ గ్యారంటీ అంటున్నారు. దీనితో పాటు తమిళంలో పూజాహెగ్డే 'కాంచన-4'లో నాయికగా నటిస్తున్నది. ఆ ప్రాజెక్ట్‌పై అంచనాలున్నాయి. ఈ సినిమాలతో తన కెరీర్ గాడిలో పడుతుందని, ఓ ఏడాది ఓపిక పడితే చాలు ఇక విజయాలే అంటున్నది పూజాహెగ్డే.



## న్యూఏజ్ లవ్‌స్టోరీ 'సయారా'


ఆషికి-2, మలంగ్, ఏక్ విలన్ వంటి ప్రేమకథా చిత్రాల్ని రూపొందించిన దర్శకుడు మోహిత్ సూరి తాజా చిత్రం 'సయారా'. ప్రముఖ నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తున్నది. అనీత్ పద్దా కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా నుంచి 'బర్బాద్..' అనే ప్రేమగీతాన్ని విడుదల చేశారు. ది రిష్ స్వరకల్పన చేస్తూ సాహిత్యాన్ని అందించాడు. జుబిన్ ఆలపించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మోహిత్‌సూరి మాట్లాడుతూ 'న్యూఏజ్ లవ్‌స్టోరీ ఇది. నేటి యువత మనోభావాలకు అద్దంపట్టేలా ఉంటుంది. సంగీతభరిత ప్రేమకథా చిత్రంగా మెప్పిస్తుంది. 'బర్బాద్..' పాటలో లోతైన భావాలున్నాయి. ప్రేమికుల గొప్పదనాన్ని చాటుతూ, ప్రణయబంధంలోని మాధుర్యాన్ని తెలియజేస్తుంది. ఓ హృద్యమైన ప్రేమకథగా 'సయారా' అందరిని మెప్పిస్తుంది' అన్నారు. జూలై 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఇప్పుడిక ఉస్తాద్ వంతు!



**అగ్ర** హీరో పవన్‌కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలకు కాస్త విరామమిచ్చి వరుసగా తన సినిమాల్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇటీవలే 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) సినిమా సెట్‌లోకి అడుగుపెట్టారాయన. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. తాజాగా ఆయన 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూట్‌లో జాయిన్ అయ్యారు. హరీష్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. పవన్‌కల్యాణ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత 'ఉస్తాద్ భగత్‌సింగ్' సెట్‌లో పవన్‌కల్యాణ్ ఎంట్రీ ఇవ్వడంతో యూనిట్ సభ్యుల్లో జోష్ కనిపిస్తున్నదని మేకర్స్ తెలిపారు. 'గబ్బర్‌సింగ్ ' (2012) వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత పవన్‌కల్యాణ్-హరీష్‌శంకర్ కాంబోలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్'పై ప్రేక్షకులు భారీ అంచనాల్ని పెట్టుకున్నారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆయనంక బోస్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, రచన-దర్శకత్వం: హరీష్‌శంకర్.ఎస్.

## నెటిజన్‌కు అమితాబ్ కౌంటర్



**బాలీవుడ్ లెజెండ్,** బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన సినిమాల విశేషాలను పంచుకుంటూ అభిమానులు అడిగిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలిస్తుంటారు. సోమవారం రాత్రి ఎక్స్ (ట్విట్టర్)లో అభిమానులతో ఓ సెషన్ నిర్వహించారాయన. ఇందులో ఓ అభిమాని వ్యంగ్యంగా అడిగిన ప్రశ్నకు అమితాబ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ సెషన్‌లో ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు అమితాబ్. 'మీరు సుదీర్ఘ కాలం జీవించాలంటే మీ గాడ్జెట్స్‌ను బ్రేక్ చేయండి' అని సూచించారు. ఇది చూసిన ఓ నెటిజన్ 'మీరు టైంకు నిద్రపోండి. లేకపోతే ఎక్కువకాలం జీవించలేరు' అని కామెంట్ చేశారు. ఆ వ్యక్తికి అంతే వ్యంగ్యంగా రిప్లై ఇచ్చారు బిగ్‌బీ. 'నా మరణం గురించి మాట్లాడినందుకు మీకు ధన్యవాదాలు..అంతా ఈశ్వరుని దయ' అంటూ నమస్కరిస్తున్న ఎమోజీని జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అనంతరం ఉత్తమ జీవన మార్గాలను ఉదహరిస్తూ అమితాబ్‌బచ్చన్ వరుస పోస్ట్‌లు పెట్టారు. ప్రస్తుతం ఆయన తెలుగులో 'కల్కి-2'లో నటిస్తున్నారు.



## హారర్ థ్రిల్లర్ 'నిశ్శబ్ద'

**మనోజ్‌కుమార్,** ఆశిత రెడ్డి జంటగా నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'నిశ్శబ్ద'. రమణమూర్తి తంగెళ్లపల్లి దర్శకుడు. శ్రీనివాస్, ఎం.సంధ్యారాణి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. కథానుగుణంగా రాత్రి వేళల్లో ఎక్కువ భాగం షూటింగ్ చేశామని, డిఫరెంట్ హారర్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని, కథలోని మలుపులు ఉత్కంఠకు గురిచేస్తాయని దర్శకుడు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా టీజర్ రిలీజ్ కావడం ఆనందంగా ఉందని, విభిన్న కాన్సెప్ట్‌తో ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని నిర్మాత శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా కథానాయికగా పరిచయమవుతున్నానని, అభినయ ప్రధానమైన పాత్రలో నటించానని ఆశిత రెడ్డి చెప్పింది. స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న చిత్రమిదని హీరో మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రమణమూర్తి తంగెళ్లపల్లి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.